సాక్షి కామారెడ్డి


శనివారం । 26 । ఏప్రిల్ । 2025



మలేరియాను నివారించాలి

ప్రపంచ మలేరియా నివారణ దినం సందర్భంగా శుక్రవారం పలు ప్రాంతాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

- IIIలో ▸



టార్పాలిన్ల భారం

సర్కారు సబ్సిడీపై టార్పాలిన్లు సరఫరా చేయకపోవడంతో రైతులు అద్దెకు తీసుకుంటున్నారు.

- IIIలో ▸

గరిష్ఠం/కనిష్ఠం
44.6 /23.4

వాతావరణం

ఉదయం ఈదురుగాలులు వీస్తాయి. క్రమంగా ఎండ తీవ్రత పెరుగుతుంది. వాతావరణం పొడిగా మారుతుంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

'మూడేళ్లు పోషకాహారం తీసుకోవాలి'



ఎల్లారెడ్డి : గర్భం దాల్చిన నాటి నుంచి చిన్నారులకు రెండేళ్ల వయసు వచ్చేంతవరకు తల్లులు పోషకాహారం తీసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి ప్రమీల సూచించారు. ఇది అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మాత్రమే సాధ్యమవుతుందన్నారు. శుక్రవారం ఎల్లారెడ్డి ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్‌లో భాగంగా సామూహిక సీమంతాలు, అక్షరభ్యాసం, అన్నప్రాసన, గ్యాడ్యుయేషన్ డే కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రమీల మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు పోషకాహారం అందిస్తున్నామన్నారు. దీనిని తీసుకోవడం వల్ల బిడ్డలు ఆరోగ్యంగా జన్మిస్తారన్నారు. పిల్లలకు రెండేళ్ల వయసు వచ్చేంత వరకు తల్లిపాలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో సీడీపీవో స్వరూప రాణి, సూపర్‌వైజర్లు హారతి, భారతి, సీనియర్ అసిస్టెంట్ మహీపాల్, అంగన్‌వాడీ టీచర్లు దేవకర్ణ, నీలారాణి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

'ఉగ్రదాడి హేయమైన చర్య'

కామారెడ్డి టౌన్: జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి హేయమైన చర్య అని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పేర్కొన్నారు. ఇది అమానవీయ చర్య అన్నారు. ఇలాంటివాటిని ప్రతి ఒక్కరు తీవ్రంగా ఖండించాలని కోరారు. కలలో కూడా ఇలాంటి చర్యలకు పాల్పడాలంటే వెన్నులో వణుకు పుట్టేలా నిందితులకు కఠిన శిక్ష అమలు చేయాలని కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బ్లూ కోల్ట్స్ సిబ్బందికి సన్మానం



కామారెడ్డి టౌన్: పిట్లం మండలంలో ఇటీవల చెరువులో దూకి ఆత్మహత్యకు యత్నించిన మహిళను కాపాడిన బ్లూ కోల్ట్స్ సిబ్బంది రవిచంద్ర, మారుతిలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి వరప్రసాద్ అభినందించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కోర్టు భవనంలో వారిని సన్మానించి, మొక్కలను జ్ఞాపికగా అందించారు.

అకాల వర్షంతో ఆందోళన



కామారెడ్డి రూరల్/రాజంపేట: కామారెడ్డి బల్దియా పరిధిలోని దేవునిపల్లి, లింగాపూర్, సరంపల్లి గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం అకాల వర్షం కురిసింది. అరగంట పాటు గాలులతో కూడిన వర్షం కురియడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. రాజంపేట మండలకేంద్రంలో చిరుజల్లులు కురిశాయి. వర్షంతో ఎక్కడ ధాన్యం తడిచి పోతుందోనని రైతులు ఆందోళన చెందారు. వడ్ల కుప్పలపై టార్పాలిన్లు కప్పారు.

'మహిళల రక్షణ కోసమే షీటీంలు'



కామారెడ్డి క్రైం: మహిళల రక్షణ కోసమే షీటీంలు ఉన్నాయని ఎస్పీ రాజేశ్ చంద్ర పేర్కొన్నారు. షీటీంలలో కొంతకాలంగా ఉత్తమ సేవలు అందిస్తున్న మహిళా కానిస్టేబుళ్లు సౌజన్య, ప్రవీణలను అభినందించారు. శుక్రవారం తన చాంబర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల భద్రత కోసం షీ టీంల ద్వారా అనేక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఎవరికైనా సమస్యలు ఉంటే 87126 86094 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

ఉల్లంఘనులు

రోడ్డు ప్రమాదాలను నివారించడం కోసం ప్రతి ఒక్కరు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని పోలీసులు సూచిస్తున్నారు. రహదారి భద్రత నిబంధనలపై నిత్యం అవగాహన కల్పిస్తున్నారు. వాహనాల తనిఖీలు నిర్వహిస్తూ జరిమానాలు విధిస్తున్నారు. అయినా వాహనదారుల్లో మార్పు రావడం లేదు.



- జిల్లాలో విస్తృతంగా వాహనాల తనిఖీ
- హెల్మెట్ లేకుంటే జరిమానా విధిస్తున్న పోలీసులు
- 3 నెలల్లో 89,936 మందికి ఫైన్..
- అయినా మారని వాహనదారులు

కామారెడ్డి క్రైం : జిల్లా పోలీసు శాఖ ఇటీవలి కాలంలో వాహనాల తనిఖీలను పెంచింది. వాహన పత్రాలు లేకపోయినా, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించకపోయినా, డ్రైవింగ్ లైసెన్స్ లేకపోయినా, త్రిబుల్ రైడింగ్ చేస్తున్నా పోలీసులు ఎడాపెడా జరిమానాలు బాదేస్తున్నారు. మూడు నెలల కాలంలోనే (జనవరి నుంచి మార్చి వరకు) జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,19,606 చలాన్లు విధించారు. వాటిలో హెల్మెట్ లేదని విధించిన జరిమానాలే 89,936. హెల్మెట్ ధరించలేదనే కారణంతోనే రోజుకు దాదాపు వెయ్యి చలాన్లు పడుతున్నాయి.

నిబంధనలు పాటించాలి

రోడ్డు ప్రమాదాల్లో మరణాల రేటును తగ్గించడానికి చర్యలు తీసుకుంటున్నాం. అందులో భాగంగా వాహనాల తనిఖీలు విరివిగా చేపడుతున్నాం. ప్రతి వాహనదారుడు హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాలి. వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించి వా హనాలు నడిపిస్తూ క్షేమంగా గమ్య స్థానాలకు చేరుకోవాలి.



– రాజేశ్ చంద్ర, ఎస్పీ

హెల్మెట్ తప్పనిసరి అని చెబుతున్నా..

రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు హెల్మెట్ లేని కారణంగానే ఎక్కువ మరణాలు సంభవిస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ విషయంపై పోలీసులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అయినా హెల్మెట్ ధరించడానికి వాహనదారులు ఇష్టపడడం లేదు.

రోడ్డు ప్రమాదాలలో మరణాలను తగ్గించడానికే తనిఖీలను పెంచి, జరిమానాలు విధిస్తున్నామని పోలీసులు చెబుతున్నారు. కాగా పట్టణ ప్రాంతాల్లో చిన్నచిన్న అవసరాలకు బయటకు వచ్చే వారు హెల్మెట్ ధరించడం ఇబ్బందిగా భావిస్తారు. విధించే జరిమానాల్లో స్థానికులకు మినహాయింపు ఇవ్వాలని చాలా మంది వాదిస్తుంటారు. పట్టణ, గ్రామాల శివారు ప్రాంతాల్లో మాత్రమే వాహనాల తనిఖీలు చేపట్టాలనే డిమాండ్ కూడా ఉంది. ఇటీవలే ఉద్యోగాలు పొందిన కొత్త కానిస్టేబుళ్లు తమ వద్ద ఉండే సెల్‌ఫోన్‌లతో ఫొటోలు తీస్తూ, చలాన్లు వేస్తూ వాహనదారులకు చుక్కలు చూపిస్తున్నారు. దీంతో జరిమానాల సంఖ్య మరింతగా పెరిగింది. పోలీసులు అవగాహన కల్పిస్తున్నా, ఎడాపెడా జరిమానాలు వేస్తున్నా వాహనదారుల్లో మాత్రం మార్పు రావడం లేదని పెరుగుతున్న చలాన్ల సంఖ్యను చూస్తే తెలుస్తుంది. భవిష్యత్తులో హెల్మెట్ ధరించని వాహనదారులపై రవాణా శాఖ కూడా దృష్టి పెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. చలాన్ల నుంచి ఉపశమనంతో పాటు ప్రాణాలకు సైతం భద్రత ఉంటుంది కాబట్టి వాహనదారులు మారాలని పోలీసులు సూచిస్తున్నారు.

అప్పు తీర్చడం లేదని వాహనానికి నిప్పు

- ధాన్యం కుప్పకు సైతం నిప్పంటించిన అల్లుడు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన అత్తింటివారు

నాగిరెడ్డిపేట: అత్తింటివారు తీసుకున్న అప్పు తీర్చడంలేదనే కారణంతో అర్ధరాత్రి వేళ తన మామకు చెందిన టీవీఎస్ ఎక్సెల్ వాహనానికి నిప్పు పెట్టాడో అల్లుడు. అంతటితో ఆగకుండా ధాన్యం కుప్పను సైతం తగలబెట్టడానికి యత్నించాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మాసాన్‌పల్లికి చెందిన చాకలి బాలమణి, సాయిలు దంపతులు తమ కూతురును మండలంలోని మాటూర్ గ్రామానికి చెందిన బాలకృష్ణకు ఇచ్చి వివాహం జరిపించారు. కాగా అవసరాల నిమిత్తం సాయిలు తన అల్లుడు వద్ద రూ. 2 లక్షలు అప్పు తీసుకున్నాడు. ఆ డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో అల్లుడు బాలకృష్ణ.. తన భార్యను పుట్టింటి వద్ద వదిలి వెళ్లాడు. ఈనెల 23న మాసానిపల్లికి వెళ్లి భార్యను తీసుకెళ్లాడు. అత్తింటివారు తీసుకున్న అప్పు చెల్లించడం లేదన్న కోపంతో గురువారం అర్ధరాత్రి మాసాన్‌పల్లికి వెళ్లి తన మామకు చెందిన టీవీఎస్ ఎక్సెల్‌కు నిప్పుపెట్టాడు. దీంతో పాటు గ్రామశివారులోని ధాన్యంకుప్పకు సైతం నిప్పటించాడు. ఎక్సెల్ వాహనం పూర్తిగా కాలిపోగా.. ధాన్యం కుప్ప పాక్షికంగా కాలిపోయింది. ఈ విషయమై చాకలి బాలమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని ఎస్సై మల్లారెడ్డి తెలిపారు.



కాలిపోయిన ఎక్సెల్ వాహనం

ఎమ్మెల్సీలకు సన్మానం

కామారెడ్డి టౌన్: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య, పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డిలతోపాటు కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీలు మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యారంగ, నిరుద్యోగ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కానికి కృషి చేస్తామన్నారు. అనంతరం అహిల్యా బాయి హోల్కర్ త్రిశతాబ్ది జయంతి వేడుకలలో పాల్గొన్నారు. కార్యక్రమంలో తపస్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు హన్మంత్‌రావు, సురేష్, జిల్లా అధ్యక్షుడు పుల్లం రాఘవరెడ్డి, నాయకులు పాలేటి వెంకట్రావు, రవీంద్రనాథ్, రమేష్ కుమార్, భాస్కరాచారి, రాంచంద్రం, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీలను సన్మానిస్తున్న తపస్ ప్రతినిధులు

పైప్‌లైన్ పనులను వేగవంతం చేయాలి

కామారెడ్డి క్రైం: మిషన్ భగీరథ పైప్‌లైన్ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మిషన్ భగీరథ, మున్సిపల్ అధికారులతో శుక్రవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లాలోని అర్గుల్ నుంచి కామారెడ్డికి నీటిని సరఫరా చేసే 14 కిలోమీటర్ల మిషన్ భగీరథ పైప్‌లైన్ పనుల్లో వేగం పెంచాలన్నారు. రోజువారీగా కామారెడ్డికి వస్తున్న నీరు, వార్డుల వారీగా సరఫరా చేస్తున్న నీటి వివరాలను రోజూ తప్పనిసరిగా సమర్పించాలని ఆదేశించారు. పట్టణ ప్రాంతంలో ప్రజలకు ఇంకుడు గుంతలపై అవగాహన కల్పించి, వర్షాకాలం నాటికి ఇంకుడు గుంతలను నిర్మించాలని ఆదేశించారు.

సమావేశంలో అదనపు కలెక్టర్ చందర్, మిషన్ భగీరథ ఎస్ఈ రాజేంద్ర కుమార్, ఈఈ నరేష్, మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి, ఏఈఈ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులను పూర్తి చేయాలి

కామారెడ్డి క్రైం: మద్దెల చెరువు నుంచి పిట్లం వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. శుక్రవారం తన క్యాంప్ కార్యాలయంలో అటవీ, రోడ్లు భవనాల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అటవీ ప్రాంతానికి బయట ప్రాంతంలో ఉన్న చెట్ల నరికివేతకు అటవీ శాఖ నుంచి అనుమతి జారీ చేశామన్నారు. వాటికి శాఖాపరమైన పద్ధతిలో పరిహారం చెల్లించి తొలగించాలని రోడ్లు, భవనాల శాఖను ఆదేశించారు. అటవీ ప్రాంతంలోని చెట్లను తొలగించడం కోసం స్టేజీ- 1 అనుమతులకు చర్యలు తీసుకుని పనులు మొదలు పెట్టాలన్నారు. సమావేశంలో ఆర్డీవో వీణ, ఆర్ అండ్‌బీ ఈఈ రవిశంకర్, ఎఫ్‌డీవో రామకృష్ణ, ఎఫ్ఆర్‌వో రవి, ఏఈఈ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

భూ భారతి చట్టం రైతులకు వరం

- అవగాహన సదస్సులలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నిజాంసాగర్/బిచ్కుంద/లింగంపేట: భూ భారతి చట్టం రైతులకు వరమని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. భూ సమస్యలను పరిష్కరించడానికి ప్రజల వద్దకే అధికారులు వస్తారన్నారు. శుక్రవారం బిచ్కుంద, జుక్కల్, లింగంపేటలలో నిర్వహించిన భూ భారతి సదస్సులలో ఆయన పాల్గొన్నారు. భూ భారతి చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయా కార్యక్రమాలలో కలెక్టర్ మాట్లాడుతూ భూమికి సంబంధించిన ప్రతి సమస్యకు భూ భారతి చట్టంలో పరిష్కారం ఉందని పేర్కొన్నారు.

నీటి కుంటలు ఏర్పాటు చేసుకోవాలి

ప్రతి రైతు పొలంలో నీటి కుంటలు, కందకాలు, ఫాంపాండ్ ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. వీటిద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. ఈజీఎస్ పథకం ద్వారా ఫాంపాండ్స్ నిర్మించుకోవచ్చన్నారు. ప్రతి పంచాయతీ పరిధిలో ఐదు ఫాంపాండ్‌లు నిర్మించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో బాన్సువాడ సబ్‌కలెక్టర్ కిరణ్మయి, భూభారతి ప్రత్యేకాధికారి రాజేందర్, మైన్స్ ఏడీ నగేశ్, ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్, తహసీల్దార్లు హేమలత, వేణుగోపాల్, సురేశ్, ఎంపీడీవోలు శ్రీనివాస్, గోపాల్, ఏఎంసీ చైర్మన్ కవిత, ఏడీఏ అమీనాబీ తదితరులు పాల్గొన్నారు.



బిచ్కుందలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

1,416 దరఖాస్తులు వచ్చాయి

లింగంపేట: పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన లింగంపేట మండలంలో ఇప్పటివరకు 12 రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు నిర్వహించామని కలెక్టర్ సంగ్వాన్ తెలిపారు. భూసమస్యలపై ఇప్పటివరకు 1416 దరఖాస్తులు వచ్చాయన్నారు. శుక్రవారం ఆయన లింగంపేట తహసీల్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. రైతుల సమస్యలను కేటగిరీల వారీగా వేరు చేసి పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈనెల 30 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, అనంతరం ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా దరఖాస్తులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. శుక్రవారం లింగంపేటతో పాటు భవానీపేట, ముంబోజీపేట గ్రామాల్లో సదస్సులు నిర్వహించారు. లింగంపేటలో నిర్వహించిన సదస్సులో కలెక్టర్ పాల్గొన్నారు.



లింగంపేటలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్

అభివృద్ధిలో తిరుగులేని 'వేముల'

ఉమ్మడి జిల్లా ప్రగతిలో కీలక పాత్ర

- కాళేశ్వరం 20, 21, 21ఏ ప్యాకేజీలు, ఆర్వోబీలు, న్యాక్ భవనాల నిర్మాణం..
- పదేళ్లలో రూ.3 వేల కోట్లతో బాల్కొండ నియోజకవర్గ అభివృద్ధి
- వరుసగా మూడుసార్లు శాసనసభకు ఎన్నికైన ప్రశాంత్‌రెడ్డి
- వేముల ఇరిగేషన్ విధానాలను మెచ్చి రాష్ట్రమంతటా అమలు చేసిన కేసీఆర్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : తెలంగాణ రాష్ట్రం సిద్ధించాక ఉమ్మడి నిజామాబాద్ జిల్లాను అభివృద్ధి చేయడంలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి. రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని రగిలించిన మోతె గ్రామం ఉన్న బాల్కొండ నియోజకవర్గం నుంచి ఆయన వరుసగా మూడుసార్లు గెలుపొందారు. ఉమ్మడి జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా అడుగులు వేశారు.

తండ్రి ఆకాంక్షలను నెరవేరుస్తూ..

ప్రశాంత్‌రెడ్డి తండ్రి వేముల సురేందర్‌రెడ్డి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు అత్యంత సన్నిహితుడిగా గుర్తింపు పొందారు. ఆయన బీఆర్ఎస్ వ్యవస్థాపక సభ్యులు. అంతకుముందు నిజాం షుగర్స్ చైర్మన్‌గా, టీడీపీ జిల్లా అధ్యక్షుడిగానూ వ్యవహరించారు. బీఆర్ఎస్ స్థాపించిన సమయంలో కేసీఆర్‌తో ఉన్న గుప్పెడు మందిలో సురేందర్‌రెడ్డి ఒకరు. ఆయన తుదిశ్వాస విడిచే వరకూ బీఆర్ఎస్ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. 2009 ఎన్నికల్లో సురేందర్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఓటమి చెందగా ఆ సమయంలో ప్రశాంత్‌రెడ్డి బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జీగా పనిచేశారు. తర్వాత 2014, 2019, 2023లలో వరుసగా బాల్కొండ నుంచి గెలుస్తూ వస్తున్నారు. కేసీఆర్ మంత్రివర్గంలో మంత్రిగా సేవలందించారు. తండ్రి సురేందర్‌రెడ్డి ఆశయాల మేరకు నియోజకవర్గంలో అనేక అభి వృద్ధి కార్యక్రమాలు చేపట్టి రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచారు. ఉమ్మడి జిల్లాకు సాగునీరు అందించే, ఆయకట్టు స్థిరీకరణ చేసే కీలకమైన కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి 20, 21, 21ఏ ప్యాకేజీ పనులను మంజూరు చేయించి 70 శాతం పూర్తి చేయించారు. సారంగాపూర్, మెంట్రాజ్‌పల్లి, మంచిప్ప వద్ద పంప్‌హౌస్ పనులు, మెయిన్ పైప్‌లైన్ పనులు 70 శాతం పూర్తి చేయించారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో సమీకృత కలెక్టరేట్లు నిర్మింపజేశారు. రూ. 14 కోట్లతో నిజామాబాద్‌లో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్) భవనాన్ని పూర్తి చేయించారు. మాధవనగర్, అర్సపల్లి వద్ద ఆర్వోబీ కలలను సాకారం చేశారు. మాధవనగర్-కంఠేశ్వర్ డబుల్ రోడ్డును నాలుగు లేన్లుగా అభివృద్ధి చేయించారు.

బాల్కొండలో ప్రగతి పరుగులు..

బాల్కొండ నియోజకవర్గంలో మొత్తం రూ.3 వేల కోట్లతో రాష్ట్రంలోనే అత్యధిక అభివృద్ధి పనులు చేయించారు. కాళేశ్వరం 21ఏ ప్యాకేజీ ద్వారా రూ. 1,400 కోట్లతో 80 వేల ఎకరాలకు నీరందించారు. ఈ ప్యాకేజీ కింద పదేళ్లలో రూ. వెయ్యి కోట్లు ఖర్చు చేశారు. రూ. 600 కోట్ల శ్రీరాంసాగర్ పునరుజ్జీవ పథకం పనుల్లో భాగంగా బాల్కొండ నియోజకవర్గంలో రూ. 1,900 కోట్లు ఖర్చు చేశారు. రూ. 200 కోట్లతో 2 చెక్‌డ్యాంలు కట్టించారు. ఈ చెక్‌డ్యాంలు చూసిన కేసీఆర్ రాష్ట్రమంతటా ఇలాంటివి కట్టించారు. రూ. వెయ్యి కోట్లతో 10 ఎత్తిపోతలు నిర్మించారు. రోడ్లు, వంతెనలు, సబ్‌స్టేషన్లు, ఆస్పత్రులు, పాఠశాలల భవనాల నిర్మాణానికి వందలాది కోట్లు మంజూరు చేయించారు. భీంగల్‌లో బస్‌డిపో, లింబాద్రి గుట్ట అభివృద్ధి, భీంగల్, బాల్కొండలలో డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేయించారు.

ఏది అడిగినా కేసీఆర్ కాదనలేదు..

నియోజకవర్గంలో గ్రామాల వారీగా సమస్యలు నోట్ చేసుకొని అందుకు అనుగుణంగా బడ్జెట్ మంజూరు చేయించుకున్నా. నేను ఏది అడిగినా కేసీఆర్ కాదనలేదు. చెక్‌డ్యాంల కారణంగా వేలాది బోర్లు రీచార్జి అయ్యాయి. కొత్త బోర్లు వేసే అవసరం లేకుండా పోయింది. కాళేశ్వరం 21వ ప్యాకేజీలో భాగంగా డిస్ట్రిబ్యూటరీ లైన్లు వేయించాం. ప్రతి రెండున్నర ఎకరాలకు ఒక ఔట్‌లెట్ పాయింట్ వచ్చేలా చూశాం. ఈ నీరు వాగులోకి రావడంతో చెక్‌డ్యాంలు నిండుతున్నాయి. చెరువులూ జలకళ సంతరించుకుంటున్నాయి.

– వేముల ప్రశాంత్‌రెడ్డి, బాల్కొండ ఎమ్మెల్యే



వరదకాలువకు తూములు..

ఎస్సారెస్పీ వరద కాలువకు జగిత్యాల, కోరుట్ల, బాల్కొండ నియోజకవర్గాల పరిధిలో 16 చోట్ల తూములు ఏర్పాటు చేయించారు. వీటి ద్వారా మొత్తం 45 చెరువులు నిండుతున్నాయి. వీటికి నిర్వహణ ఖర్చు అనేదే లేదు. రూ. 12 కోట్లతో లక్ష్మి కాలువ ఆధునికీకరణ, రూ. 6 కోట్లతో నవాబ్ ఎత్తిపోతల పథకం, రూ. 12 కోట్లతో నిజాంసాగర్ ఆధునికీకరణ పనులు చేయించారు. రాష్ట్రంలోనే మొదటిసారిగా చెక్‌డ్యాములకు తూములు ఏర్పాటు చేయించి పచ్చలనడ్కుడ చెరువు నింపారు.

రేవంత్ పాలనలో దిగజారిన రాష్ట్ర పరిస్థితి

- ఎల్కతుర్తి సభలో సర్కారును కేసీఆర్ నిలదీస్తారు
- సభకు ఉమ్మడి జిల్లా నుంచి 40 వేల మందిని తరలిస్తాం
- మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ పదేళ్ల కాలంలో అభివృద్ధి, సంక్షేమంలో అన్ని రంగాల్లో దేశంలోనే అగ్రగామిగా నిలిపారని, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసమర్థ పాలనతో రాష్ట్రం పరిస్థితి దిగజారిందని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం కామారెడ్డిలో మాజీ ప్రభుత్వ విప్ గంప గోవర్దన్, మాజీ ఎమ్మెల్యేలు హన్మంత్ సింధే, జాజాల సురేందర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్‌లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ సీఎంగా ఉండగా తలసరి ఆదాయం దేశంలో ఒకటో స్థానంలో ఉంటే, ఇప్పుడు 11వ స్థానానికి పడిపోయిందన్నారు. జీఎస్‌డీపీ వృద్ధిలో మూడో స్థానం నుంచి 14 వ స్థానానికి దిగజారిందన్నారు.

మోసపూరిత హామీలపై నిలదీస్తాం..

మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి అన్ని వర్గాలను వంచించాడని ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. 2 లక్షల ఉద్యోగాలని చెప్పి 11 వేలు మాత్రమే ఇచ్చారని, తాము అధికారంలో ఉన్నపుడు ఇచ్చిన నోటిఫికేషన్లు, పరీక్షలు, నిర్వహించిన ఇంటర్వ్యూలను కూడా వారి ఖాతాలో జమ చేసుకుంటున్నారని విమర్శించారు. టీఆర్ఎస్ ఆవిర్భవించి 25 ఏళ్లు అవుతున్న సందర్భంగా ఎల్కతుర్తిలో ఆదివారం నిర్వహించే బహిరంగ సభ ద్వారా కేసీఆర్ రాష్ట్ర ప్రభుత్వ మోసాలు, వంచనను ఎండగడతారన్నారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు 420 వాగ్దానాల అమలు కోసం సర్కారుపై ఒత్తిడి పెంచడానికే సభ నిర్వహిస్తున్నామన్నారు. సభకు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి 40 వేల మంది తరలిరానున్నారని వివరించారు. ఉమ్మడి జిల్లా నుంచి 250 ఆర్టీసీ బస్సులు, 264 ప్రైవేటు బస్సులు, 626 తుఫాన్లు తదితర వాహనాలు, 1,266 సొంత వాహనాలతో తరలివెళ్తామన్నారు. వడ్లను కొనుగోలు చేయడంలో తరుగు పేరుతో రైతులను ఇబ్బంది పెడితే ఊరుకోబోమన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు మనోహర్‌రెడ్డి, కుంబాల రవి, కపిల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రమేశ్, హఫీజ్, లక్ష్మీనారాయణ, బల్వంతరావ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, పక్కన మాజీ ఎమ్మెల్యేలు గంప గోవర్ధన్, హన్మంత్ సింధే, జాజాల సురేందర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్

క్లుప్తంగా

బాలుకు వెలుగు పురస్కారం



కామారెడ్డి అర్బన్: వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ తెలుగు రాష్ట్రాల జాతీయ స్థాయి పురస్కారానికి కామారెడ్డి రక్తదాతల సమూహం వ్యవస్థాపకులు, ఐవీఎఫ్ సేవదళ్ రాష్ట్రచైర్మన్, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా సమన్వయ కర్త బాలు ఎంపికయ్యారు. 2025 సంవత్సరానికి వివిధ రంగాల వారికి వెలుగు పురస్కారాలు అందజేస్తుండగా బాలు తలసేమియా వ్యాధితో బాధపడే చిన్నారుల కోసం అనేక మెగా రక్తదాన శిబిరాల నిర్వహిస్తు రక్తం సేకరిస్తున్నందుకు గాను ఎంపిక చేసినట్టు వెలుగు సంస్థ చైర్మన్ డాక్టర్ సురభి శ్రీధర్ పేర్కొన్నారు. ఈనెల 27న గోదావరిఖనిలో నిర్వహించే కార్యక్రమంలో బాలుకు వెలుగు పురస్కారం అందజేయనున్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి



కామారెడ్డి రూరల్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం విక్రయించి ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధర పొందాలని దేవునిపల్లి-లింగాపూర్ సింగిల్ విండో డైరెక్టర్ నిట్టు శంకర్‌రావు సూచించారు. శుక్రవారం కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని లింగాపూర్ గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో అనుపాటి అంజిల్‌రెడ్డి, బండారి గోవింద్‌రెడ్డి, బండారి సంజీవరెడ్డి, బాలమల్లయ్య, శోభన్ రెడ్డి, నాగల్ల భీరయ్య, కాసర్ల రాజేందర్, సొసైటీ సీఈవో సతీష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.


రజతోత్సవ సభకు ఇలా వెళ్లొద్దాం..

బీఆర్ఎస్ పాతికేళ్ల వేడుకల సభకు ఏర్పాట్లు పూర్తి

159 ఎకరాల్లో వేదిక, సభాస్థలం.. ● జనం కోసం సకల వసతులు


భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పాతికేళ్ల వేడుకలకు వేళయింది. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం చింతలపల్లిలో ఆదివారం అంగరంగ వైభవంగా ఉద్యమ పార్టీ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు నిర్వహించేందుకు వేదిక సిద్ధమైంది. తెలంగాణ అన్ని జిల్లాల నుంచి హాజరయ్యే బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజల కోసం భారీగా ఏర్పాట్లు చేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి ఐదు రూట్లలో వచ్చే వాహనాల కోసం పార్కింగ్ ఏర్పాటు చేశారు. వేడుకలకు ఆ పార్టీ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. వేదిక ముందు లక్ష కుర్చీలు, మిగతా జనం కోసం షామియానాలు ఏర్పాటు చేశారు.

– సాక్షిప్రతినిధి, వరంగల్





జోన్	ప్రాంతాలు	రూట్
జోన్-1	వర్ధన్నపేట, వరంగల్ వెస్ట్, వరంగల్ ఈస్ట్, పరకాల, నర్సంపేట, మహబూబాబాద్, డోర్నకల్, పాలకుర్తి, ములుగు, పినపాక, భద్రాచలం, అశ్వారావుపేట, కొత్తగూడెం, ఇల్లందు	మల్లంపల్లి-గుడెప్పాడ్ -వంగపహాడ్- యూ టర్న్ ఎన్‌హెచ్ 163-హసన్‌పర్తి -ఎల్కతుర్తి
జోన్-2	ఉమ్మడి నల్లగొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మహబూబ్‌నగర్ నియోజకవర్గాలు, ఇల్లందు, వైరా, ఖమ్మం, పాలేరు, సత్తుపల్లి, మధిర	ఖమ్మంనుంచి వచ్చే వారు మామునూరు-నాయుడు పెట్రోల్ పంప్-టయోటా షోరూం-కడిపికొండ బ్రిడ్జి-మడికొండ-ఎన్‌హెచ్ 163 బైపాస్ రోడ్డు -టోల్‌గేట్-దేవన్నపేట-మడిపల్లి-అనంతసాగర్, కరుణాపురం -ఎన్‌హెచ్ 163 బైపాస్ టోల్‌గేట్-దేవన్నపేట -మడిపల్లి-అనంతసాగర్-పార్కింగ్
జోన్-3	జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్	ధర్మసాగర్-దేవునూరు - దామెర-చింతలపల్లి-పార్కింగ్
జోన్-4	ఉమ్మడి కరీంనగర్ నియోజకవర్గాలు, చెన్నూరు, మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్, ఆసిఫాబాద్, భూపాలపల్లి, పరకాల (కొంతభాగం)	కరీంనగర్, హుజూరాబాద్- కోతులనడుమ-గ్రానైట్ రోడ్డు పార్కింగ్
జోన్-5	ఉమ్మడి మెదక్, నిజామాబాద్ నియోజకవర్గాలు, నిర్మల్, ఆదిలాబాద్, ఖానాపూర్, బోథ్	సిద్దిపేట- ముల్కనూరు-ఇందిరా నగర్ పార్కింగ్



పార్కింగ్ జోన్లు 5

కేటాయించిన భూమి 1,179

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం చింతలపల్లిలో సిద్ధమైన సభా వేదిక



సభ వివరాలు

మొత్తం సేకరించిన భూమి : 1,356 ఎకరాలు

సభావేదిక : 159 ఎకరాలు

- సభకు హాజరయ్యే వారి కోసం 10 లక్షల వాటర్ బాటిళ్లు, 10 లక్షల మజ్జిగ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతున్నారు.
- వెయ్యికి పైగా వైద్య బృందాలు, 20 అంబులెన్స్‌లు సేవలందిస్తాయి.
- నిరంతర కరెంటుకు 200 జనరేటర్ల ఏర్పాటు.

కొనసాగుతున్న పార్ట్ టైం అధ్యాపకుల నిరసన

భిక్కనూరు: తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాంపస్‌లో పార్ట్ టైం అధ్యాపకులు చేపట్టిన నిరవధిక సమ్మె నాలుగో రోజుకు చేరింది. శుక్రవారం పార్ట్ టైం అధ్యాపకులు తమ ఉన్నత చదువు డిగ్రీలను ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ఈకార్యక్రమంలో అన్ని విభాగాలకు చెందిన పార్ట్ టైం అధ్యాపకులు ఉన్నారు.

కొనసాగుతున్న పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పీజీ ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ రెగ్యులర్ సెమిస్టర్ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. పీజీ ఏపీఈ, ఐఎంబీఏ, ఐపీసీహెచ్ 8వ సెమిస్టర్ రెగ్యులర్ థియరీ పరీక్షలకు 74మందికి 74మంది విద్యార్థులు హాజరయ్యారు. కంట్రోలర్ కె సంపత్‌కుమార్, ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు.

1 నుంచి తెయూ ప్రీపీహెచ్‌డీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని ప్రీపీహెచ్‌డీ బయోటెక్నాలజీ, కామర్స్, తెలుగు రెగ్యులర్/ బ్యాక్‌లాగ్ పరీక్షలు మే 1 నుంచి 3వరకు జరుగుతాయని కంట్రోలర్ కె సంపత్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్షలు ఉంటాయన్నారు. పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని లొంకల్‌పల్లి గ్రామంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు శుక్రవారం ఎమ్మార్పీఎస్ నాయకులు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా జిల్లా పర్యవేక్షకుడు మంథని సామ్యేల్ మాదిగ మాట్లాడారు. అనంతరం జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు యాదగిరి, లక్ష్మీ, లావణ్య, తొంట సాయిలు, శివానందం, శైలేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ మేట్‌పై చర్యలు తీసుకోవాలి

పెద్దకొడప్‌గల్(జుక్కల్): ఉపాధి హామీ పని కల్పించడంపై ఉపాధి హామీ మేట్ రాందాస్ నిర్లక్ష్యం వహిస్తున్నాడని కాటేపల్లి గ్రామస్తులు ఆరోపించారు. ఈమేరకు శుక్రవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. అనంతరం కార్యాలయంలో వారు వినతిపత్రం అందజేశారు. మండలంలో కాటేపల్లి గ్రామానికి చెందిన ఉపాధి కూలీలు ఏప్రిల్ 24 నుంచి 30 వరకు పని కల్పించాలని మేట్‌కు రాసి ఇచ్చారు. అందులో కొందరికి మాత్రమే పని కల్పించి మిగితా వారికి పని కల్పించలేదని మస్టర్లలో పేర్లు రాని వారు వాపోయారు. పని అందరికీ ఉండాలని, లేకుంటే మొత్తం బంద్ చేయాలని వారు మేట్ రాందాస్‌ను ప్రశ్నించారు. గురు,శుక్రవారాలు ఉపాధి పని చేసినా, మస్టర్లో పేరు రాలేదని, ఆన్‌లైన్‌లో హాజరు వేయకపోతే ప్రభుత్వం కూలి డబ్బులు వేయదన్నారు. ఈవిషయమై ఎంపీడీవో కార్యాలయానికి చేరుకొని ఆందోళన చేశారు.మార్చి నెలలో కొందరు కూలీలతో వ్యక్తిగత వ్యవసాయ పనులు చేయించుకొని హాజరు వేశారని, ఉపాధి పని చేయని వారికి హాజరు వేస్తున్నట్లు కూలీలు ఆరోపించారు. మేట్ రాందాస్‌పై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.



వినతిపత్రం అందిస్తున్న కాటేపల్లి గ్రామస్తులు

నీటి సమస్య లేకుండా చూడాలి

- నీటి సరఫరాలో డబ్బులు వసూలు చేయొద్దు
- రాజకీయ నాయకుల ఇంటి సంపులో నీటిని పోయొద్దు
- సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే కేవీఆర్

కామారెడ్డి టౌన్: పట్టణంలో 49 వార్డులలో ఎక్కడా నీటి సమస్య లేకుండా చూడాలని నియోజకవర్గ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అధికారులు, వార్డు ఆఫీసర్లతో నీటి సమస్యపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సమస్య ఉన్న చోట ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేపట్టాలన్నారు. మున్సిపల్ ట్యాంకర్ల నీటి సరఫరా సమయంలో ఇంటి యాజమానుల నుంచి డబ్బులు వసూలు చేయవద్దన్నారు. అలాగే రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధుల, అధికారుల ఇళ్లలోని నీటి సంపుల్లో నీటిని పోయవద్దని హెచ్చరించారు. వార్డు ఆఫీసర్లు వార్డుల్లో నీటి అవసరాలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని ఆదేశించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే వార్డు ఆఫీసర్లపై చర్యలు తీసుకుంటామన్నారు. ఎప్పటికప్పుడు మున్సిపల్ బోర్లను మరమ్మత్తులు చేయించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న పలువురు వార్డు ఆఫీసర్లపై, పర్యవేక్షణలో నిర్లక్ష్యంపై డీఈ, ఏఈలపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి, డీఈ వేణుగోపాల్, ఏఈ శంకర్, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కామారెడ్డి అర్బన్: పట్టణంలోని ఆర్‌బీనగర్ కాలనీలోని ఇష్టకార్య సిద్ధి అంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం శుక్రవారం నిర్వహించారు.ఈసందర్భంగా సువర్చల సహిత హనుమాన్ కల్యాణం, హోమం, అభిషేకం, అలంకరణ, పల్లకీసేవ కార్యక్రమాలు వేదపండితులు జి.అంజనేయశర్మ, సతీష్‌పాండేలు ఆధ్వర్యంలో కొనసాగాయి. ఈకార్య క్రమానికి ఎమ్మెలే వెంకటరమణారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తుల కోసం నిర్మించిన హాల్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు నిత్యానందం, తదితరులున్నారు.

నృత్య విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే

స్థానిక కూచిపూడి కళా క్షేత్రం నృత్య విద్యార్థులు హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో భారత్ ఆర్ట్స్ అకాడమీ గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు కోసం నిర్వహించిన కూచిపూడి నృత్య రూపకం అంశంలో పాల్గొన్నారు. విద్యార్థులు హర్షిత, రితిక, రసజ్ఞ, హస్విత, నందిని, ఆద్య, విశ్వశ్రీ లతో డ్యాన్స్ మాస్టర్ వంశీ ప్రతాప్ గౌడ్‌లు శుక్రవారం ఎమ్మెల్యే వెంకట రమణరెడ్డిని కలిసి తమ ప్రతిభను వివరించారు. వారిని ఎమ్మెల్యే అభినందించారు.



హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ సంగ్వాన్

గాంధారి(ఎల్లారెడ్డి): ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రానికి తెచ్చి ధాన్యం రాశులను, ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలించారు. కేంద్రానికి వచ్చిన ధాన్యాన్ని వెంటవెంటనే తూకం వేయాలని, ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలించాలని ఆదేశించారు. వాతావరణంలో మార్పులు వచ్చిన కారణంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వర్షం పడితే ధాన్యం తడువకుండా రైతులకు తగినన్ని టార్పాలిన్ కవర్లను అందజేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజరు రాజేందర్, జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున్ బాబు , జిల్లా సహకార అధికారి రామ్‌మోహన్, తహసీల్దార్ రేణుక చౌహాన్, ఎంపీడీవో రాజేశ్వర్, సింగిల్ విండో చైర్మన్ సాయికుమార్, ఏఎంసీ చైర్మన్ పరమేశ్వర్, గాంధారి మాజీ సర్పంచ్ సంజీవ్, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన

బిచ్కుంద: మండల కేంద్రంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను శుక్రవారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పరిశీలించారు. అర్హులైన వారు కట్టుకుంటామని ముందుకు వచ్చిన ప్రతి లబ్ధిదారు పేరు ఇందిరమ్మ జాబితాలో చేర్చాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం ఇస్తున్న రూ.5 లక్షలతో సొంతింటి కళ సాకారం చేసుకోవాలని లబ్ధిదారులకు కలెక్టర్ సూచించారు.

క్రైం కార్నర్

మనస్తాపంతో ఒకరి ఆత్మహత్య



బాన్సువాడ: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బాన్సువాడలో చోటు చేసుకుంది. సీఐ అశోక్ శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. బాన్సువాడ పట్టణానికి చెందిన రాంపురం నారాయణ(65) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తితో స్థానిక ఎల్లయ్య చెరువు కట్ట సమీపంలో ఉన్న చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి



సిరికొండ: మండలంలోని పోత్నూర్ గ్రామానికి చెందిన పెరిక సాగర్(40) ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందినట్లు ఎస్సై ఎల్ రామ్ తెలిపారు. సాగర్ గురువారం ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడని ఎస్సై తెలిపారు. శుక్రవారం చిన్న వాల్గోట్ శివారులోని వ్యవసాయ బావిలో సాగర్ మృతదేహం లభ్యమైంది. కాలకృత్యాలకు వెళ్లి కాలు జారి బావిలో పడి మృతి చెందాడని మృతుడి భార్య స్వరూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్యతో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు.

ఎలుగుబంటి దాడిలో మహిళకు గాయాలు

మోర్తాడ్: భీమ్‌గల్ మండలం రహత్‌నగర్ అటవీ ప్రాంతంలో శుక్రవారం తునికి ఆకు సేకరణకు వెళ్లిన ఓ మహిళపై ఎలుగుబంటి దాడి చేసిన ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మంజుల అనే మహిళ తునికి ఆకు కోస్తుండగా ఎలుగుబంటి వెనుక నుంచి వచ్చి దాడి చేసింది. ఆమె అరుపులు వేయడంతో పరిసరాల్లో ఉన్న ఆకు తెంపేవారు రావడంతో ఎలుగుబంటి పారిపోయింది. ఆమెను మెరుగైన వైద్యం కోసం ఆర్మూర్ ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలించారు.

వృద్ధురాలిని గాయపరిచి బంగారం చోరీ


నవీపేట: మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం ముగ్గురు దొంగలు బీభత్సం సృష్టించారు. మండలంలోని నారాయణ్‌పూర్ గ్రామానికి చెందిన వృద్ధురాలు రాచర్ల కిష్టాబాయి మహారాష్ట్రలోని యాతాలం గ్రామంలో జరిగిన శుభకార్యానికి వెళ్లింది. సొంత గ్రామానికి వెళ్లేందుకు నవీపేట బస్టాండుకు వచ్చింది. మల విసర్జనకు టాయిలెట్‌కు వెళ్లగా ఇద్దరు మహిళలు, ఓ వ్యక్తి ఆమెను బలవంతంగా బయటకు పిలిచారు. బయటకు రాగానే ఆమెపై దాడి చేసి మెడలో ఉన్న బంగారు గొలుసు, చెవి కమ్మలను లాక్కొని పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వినయ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

రుద్రూర్: పొతంగల్ మండలం తిర్మలాపూర్ శివారులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని హంగర్గ ఫారం వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం, పొతంగల్ వైపు వస్తున్న ఆటో ఢీకొన్నాయి. ప్రమాదంలో బైక్‌పై ఉన్న వ్యక్తికి గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

ఆర్ఎంపీ క్లినిక్ సీజ్

నిజామాబాద్ నాగారం: నగరంలోని న్యాల్‌కల్ రోడ్‌లో ఉన్న ఆర్ఎంపీ క్లినిక్‌ను డీఎంహెచ్‌వో రాజశ్రీ శుక్రవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా రోగులకు కుట్లు వేయడం, ఇంజక్షన్లు ఇవ్వడం చూసి సదరు ఆర్ఎంపీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే క్లినిక్‌ను సీజ్ చేయాలని ఆదేశాలు జారీ చేయడంతో సంబంధిత అధికారులు రాత్రి 9:40 ప్రాంతంలో క్లినిక్‌ను సీజ్ చేశారు.



ప్లీజ్ ఒక్క క్షణం..

గతేడాది ఖానాపూర్‌కు చెందిన గౌతం కాంబ్లే(28) అనే యువకుడు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నాడు. తన తల్లి ఆరోగ్య పరిస్థితి బాగాలేక, ఆస్పత్రిలో చూపించేందుకు డబ్బులు లేవని మానసిక వేదనకు గురై క్షణికావేశంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రైవేట్ పని చేస్తూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటున్న గౌతం మృతితో తల్లిదండ్రులకు తీరని శోకమే మిగిలింది.

రూరల్ మండలం ఆకుల కొండూర్ గ్రామానికి చెందిన ఆకాశ్(24) అనే యువకుడు స్థానికంగా పెట్రోల్ బంక్‌లో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఆకాశ్ బెట్టింగ్ యాప్‌లకు అలవాటు పడి రూ. ఐదు లక్షల వరకు పోగొట్టుకున్నాడు. తల్లిదండ్రులు ఏమంటారో అనే భయంతో ఈ నెల 2న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అతని మృతితో కుటుంబం కోలుకోవడం లేదు.

- ఆత్మహత్యలు వద్దు.. జీవితమే ముద్దు
- సర్దుబాటు తత్వంతో ముందుకు సాగితేనే జీవితం ఆనందం

నిజామాబాద్ రూరల్: జీవించి సాధించాల్సింది.. కుంగుబాటుకు గురై పలువురు అర్ధాంతరంగా తనువు చాలిస్తున్నారు. యుక్తవయసులో ఉన్నవారు సైతం బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. జీవితంలో ఎదురైన సమస్యలకు భయపడి.. నిరాశ, నిస్పృహలతో ఆత్మవిశ్వాసాన్ని కోల్పోతున్నారు. ఆపై మనోవేదనతో ప్రాణాలు తీసుకుని.. నిండు జీవితాన్ని కోల్పోతున్నారు. కుటుంబ సభ్యులకు తీరని శోకాన్ని మిగుల్చుతున్నారు. అందుకే మనుషులకు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం ఎంతో ముఖ్యమని మానసిక వైద్యనిపుణులు పేర్కొంటున్నారు. నిత్యజీవితంలో ఎదురైన సమస్యలను సానుకూల దృక్పథంతో పరిష్కరించుకోవాలని, సర్దుబాటుతత్వంతో ముందుకు సాగితే జీవితం ఆనందంగా ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు.

పిల్లలతో ఫ్రెండ్లీగా ఉంటేనే..

యుక్త వయస్సుకు వచ్చిన పిల్లలతో తల్లిదండ్రులు ఫ్రెండ్లీగా ఉండటమే మంచిది. వారిపై ఎక్కువగా కోపం కన్నా ప్రేమ చూపిస్తే చేసిన తప్పును వెంటనే చెబుతారు. దీంతో సమస్య పరిష్కారమవుతుంది. చేసిన తప్పును పదే పదే వారిపై విరుచుకుపడితే మనస్థాపనకు గురై ఆత్మహత్యలకు పాల్పడే అవకాశం ఉంటుంది. దురాలవాట్లకు గురయ్యే పిల్లలపై నిరంతరం పర్యవేక్షణ ఉండటమే మంచిది. కుటుంబం గురించి.. తల్లిదండ్రులు పడుతున్న బాధలను పిల్లలకు తెలియజేస్తేనే వారు చెడు అలవాట్లకు దూరంగా ఉంటారు.

జీవితాన్ని నాశనం చేసుకోవద్దు

వేగంగా డబ్బులు సంపాదించాలని ఆశతో యువత చెడు మార్గాల వైపు వెళ్తున్నారు. ఇది మంచి పద్ధతి కాదు. ఆన్‌లైన్ గేమ్‌లతో చాలా మంది యువత నష్ట పోతున్నారు. విద్యార్థులు, యువత తల్లిదండ్రులు పడుతున్న బాధను అర్థం చేసుకోవాలి. అందమైన జీవితాన్ని క్షణికావేశంలో నాశనం చేసుకోకూడదు.

– డాక్టర్ విశాల్, ప్రముఖ సైకాలజిస్టు

ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలి

యుక్త వయస్సు వచ్చిన యువకులు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలి. వారికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు క్రమశిక్షణతోపాటు మంచి అలవాట్లను నేర్పించాలి. జీవితంలో వచ్చే ఆటుపోట్లను ఎలా ఎదుర్కోవాలో వివరించాలి. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి. లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి.

– ఆనంద్‌సాగర్, ఎస్సై-2, రూరల్ పీఎస్

కాటేపల్లిలో అగ్ని ప్రమాదం



పెద్దకొడప్‌గల్: పశువుల మేత కోసం ట్రాక్టర్‌లో తరలిస్తున్న గడ్డికి ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగలడంతో అగ్ని ప్రమాదం చోటు చేసుకున్న ఘటన కాటేపల్లిలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కాటేపల్లి నుంచి ట్రాక్టర్‌లో తీసుకెళ్తున్న వరిగడ్డికి కుమ్మరి కుంట వద్ద విద్యుత్ తీగలు తగలడంతో మంటలు చెలరేగాయి. గ్రామస్తులు మంటలను ఆర్పేందుకు యత్నించినా అదుపులోకి రాకపోవడంతో గడ్డిని ట్రాక్టర్ నుంచి తొలగించారు.

బోర్గాం జెడ్పీహెచ్ఎస్‌లో..

మోపాల్: నగర శివారులోని బోర్గాం(పి) జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం రాత్రి స్టోర్ రూమ్‌లో అగ్నిప్రమాదం జరిగింది. గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక కేంద్రం, పాఠశాల హెచ్‌ఎం శంకర్‌కు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. ప్రమాదంలో పాత పుస్తకాలు, పాత బెంచీలు, ఇతర సామగ్రి కాలిపోయాయి. షార్ట్‌సర్క్యూట్‌తోనే ప్రమాదం జరిగినట్లు హెచ్‌ఎం శంకర్ తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

లింగంపేట: మండలంలోని పొల్కంపేటకు చెందిన దామ ఎల్లయ్య(50)ను ట్రాక్టర్ ఢీకొనడంతో మృతి చెందినట్లు ఎస్సై వెంకట్రావు శుక్రవారం తెలిపారు. ఎల్లయ్య గురువారం సాయంత్రం నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో గ్రామానికి చెందిన సూరంపల్లి యాదగిరి అజాగ్రత్తగా ట్రాక్టర్ నడుపుతూ ఢీకొన్నాడు. ఈ ఘటనలో ఎల్లయ్యకు తీవ్రగాయాలు కావడంతో కామారెడ్డికి తరలించగా మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి భార్య అక్కవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.